క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్ మండల పరిధిలో 112 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అందజేశారు. పట్టణంలోని బేగంగార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పేదల సంక్షేమానికి సర్కారు నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, ఎంపీపీ జయమ్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు జహంగీర్‌ఖాన్, వై. కుమార్, మేకల వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీరు, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని వినతి



కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రతో వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు మంగళవారం సమావేశమయ్యారు. డివిజన్‌లలో నెలకొన్న డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థను ఆధునీకరించాలని కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, అస్లాంబిన్ అబ్దుల్లా, ప్రశాంత్‌నాయక్‌లు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సరైన సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నివేదిక రూపొందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో నాయకులు నాగరాజు, ఖాజా తదితరులున్నారు.

టెడెక్స్ హైదరాబాద్ 17న...

సాక్షి, సిటీబ్యూరో: విజయవంతమైన వ్యక్తుల ప్రసంగాల వేదిక టెడెక్స్ హైదరాబాద్ నగరంలో తమ 9వ ఎడిషన్‌ను ఈ నెల17 నిర్వహించనుంది. ఈ సందర్భంగా నగరంలో గచ్చిబౌలిలో ఉన్న ప్రధాన్ కన్వెన్షన్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రసంగించనున్న 12 మంది భిన్నరంగాలకు చెందిన విజయవంతమైన వ్యక్తుల జాబితాను శనివారం విడుదల చేసింది. వీరిలో నగరానికి చెందిన సస్టెయినబుల్ ఛాంపియన్ కల్పనా రమేష్, పిన్న వయసు పర్వతారోహకురాలు మలావత్ పూర్ణ, నెఫ్రోప్లస్ వ్యవస్థాపకుడు కమల్‌షా...తదితరులు ఉన్నారు.

ఇండియా ఈబీ-5 పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి

రాయదుర్గం: ఐఐయూఎస్‌ఏ పాస్‌పోర్టు సిరీస్ ద్వారా అమెరికాలో పెట్టుబడులకు ప్రత్యేకించి ఈబీ-5 ఇమ్మిగ్రేంట్ ఇన్వెస్టర్ ప్రోగామ్ భారతీయ పెట్టుబడిదారులకు అండగా ఉంటుందని ఐఐయూఎస్‌ఏ అధ్యక్షుడు ఆరోన్‌గ్రౌ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో ఇన్వెస్ట్ ఇన్ యూఎస్‌ఏ (ఐఐయూఎస్‌ఏ), పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(పీహెచ్‌డీసీసీఐ) సంయుక్త ఆధ్వర్యంలో ఇండియా ఈబీ-5 పాస్‌పోర్ట్ రోడ్డు షో సిరీస్ కార్యక్రమాన్ని ఐఐయూఎస్‌ఏ డైరెక్టర్ ఆఫ్ ఈవెంట్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ మెకెంజీ పెంటన్ , పీహెచ్‌డీసీసీఐ ఇంటర్నేషనల్ అఫైర్స్, ట్రేడ్ ఫెయిర్ డివిజన్ మయాంక్ చత్వాల్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇమ్మిగ్రేషన్ అవకాశాలపై పెరుగుతున్న ఆసక్తికి ఇది నిదర్శనమన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

శంషాబాద్: గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మన్యం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సోమవారం అర్ధరాత్రి ప్యారడైజ్ హోటల్ ఎదురుగా ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి (50) తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై నీలిరంగు చొక్కా, బ్రౌన్ కలర్ ప్యాంటు ఉన్నాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫస్టియర్ ఫుల్‌ఫిల్ ప్రభుత్వ కాలేజీలో భారీగా అడ్మిషన్లు

- మొదటి సంవత్సరం 515 మంది చేరిక
- కంప్యూటర్ సైన్స్ ఒకేషనల్ కోర్సుకు డిమాండ్



మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో అడ్మిషన్ల సంఖ్య పెరగడం విశేషం. ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి చేరువలోని ఈ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఒకేషనల్ కోర్సులో విద్యార్థులు ఎక్కువగా చేరారు. పేద, మధ్య తరగతివారికి ఇంటర్మీడియట్ విద్యను ఉచితంగా అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోంది. కాగా కళాశాలలో ప్రస్తుతం 10 తరగతి గదులు ఉండగా మరో ఆరు తరగతి గదులు అవసరమని సిబ్బంది పేర్కొంటున్నారు. ఒక్కో తరగతి గదిలో 150 నుంచి 160 మంది వరకు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

- ఇప్పటి వరకు కళాశాలలో ఫస్ట్ ఇయర్‌లో 515 మంది చేరారు.
- అందులో 115 మంది కంప్యూటర్ సైన్స్ ఒకేషనల్ కోర్సులో చేరారు.
- సెకండ్ ఇయర్‌లో 388 మంది కొనసాగుతున్నారు. మొత్తం కళాశాలలో విద్యార్థుల సంఖ్య 903కు చేరింది.
- గత ఏడాది కొత్తగా 370 మంది విద్యార్థులు చేరగా ఈసారి 145 మంది ఎక్కువగా చేరారు

కళాశాలలోని కోర్సులు ఇవే..

- రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ, ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం రెండూ నిర్వహిస్తున్నారు.
- ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు చేరువలోని మధురానగర్‌లో కొనసాగుతున్న రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్‌సైన్స్ ఒకేషనల్ కోర్సును నిర్వహించడం విశేషం.
- ఈ కోర్సుతో ఉద్యోగ అవకాశాలు లభిస్తుండడంతో డిమాండ్ పెరిగింది.
- కొత్తగా కళాశాలలో చేరే విద్యార్థులకు ఉచితంగా టెక్స్ట్‌బుక్‌లు అందిస్తారు
- ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తారు
- అర్హులైన వారందరికీ బస్‌పాస్ సౌకర్యం ఉంటుంది.
- లైబ్రరీ, ల్యాబ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. విద్యార్థులకు ప్రభుత్వం ద్వారానే కాకుండా దాతల సహకారంతో కూడా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. ఏటేటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఒకప్పుడు 50 మందితో కొనసాగిన కళాశాలలో ఇప్పుడు ఈ ఏడాది ఫస్ట్ ఇయర్‌లో 515 మంది చేరారు ఈసారి కంప్యూటర్ కోర్సు ఒకేషనల్ కోర్సులో ఏకంగా 115 మంది చేరడం విశేషం.

–శ్రీనివాసులు, ప్రిన్సిపల్, రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల

నేతాజీనగర్‌లో కార్పొరేటర్ పర్యటన



నేతాజీనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని నేతాజీనగర్ కాలనీలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మంగళవారం పర్యటించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా సీసీ రోడ్లు వేయనున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులను అప్పటికప్పుడే పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నాతమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, జగన్, రామురావు, సురేష్, రాఘవ రెడ్డి, భువమ్మా, సాగర్, జీహెచ్‌ఎంసీ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తోకల 'ఆరోగ్య రథం' ప్రారంభం



గంధంగూడలో తోకల ఆరోగ్య రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో తోకల ఆరోగ్య రథం సేవలను ప్రారంభించామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గండిపేట మండలం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ గంధంగూడలో మొదటి విడతగా తోకల ఆరోగ్య రథాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందుతుందన్నారు .కార్యక్రమంలో మల్లారెడ్డి, జాయింట్ కన్వీనర్ మహాలింగంగౌడ్, మున్సిపల్ ప్రెసిడెంట్ మహేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి నరేష్, గోపి, కంటెస్టెడ్ కార్పొరేటర్ శ్రీనివాస్, శివలీలా, నవీన్‌రెడ్డి, శివగౌడ్, శేఖర్, శ్రీశైలం, నర్సింగ్‌గౌడ్, జనార్ధన్‌రెడ్డి, సూర్య, విష్ణువర్ధన్, అభిలాష్‌రెడ్డి తదితరులున్నారు.

ఎంజీఐటీలో అబ్రాడ్ స్టడీ ఫెయిర్



అబ్రాడ్ స్టడీ ఫెయిర్‌లో పాల్గొన్న విశ్వవిద్యాలయాల ప్రతినిధులు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో మంగళవారం విదేశీ విద్యకు సంబంధించి వన్‌డే ఆన్ క్యాంపస్ స్టడీ అబ్రాడ్ ఫెయిర్ నిర్వహించారు. గ్లోబల్ ఎడ్యుకేషన్, కెరీర్స్ ఫోరమ్, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆసక్తి ఉన్న చివరి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు అవసరమైన సమాచారం, స్కాలర్‌షిప్, వీసా విధానాల గురించి వివరించారు. యూఎస్‌ఏ, యూకే, ఫ్రాన్స్, ఐర్లాండ్ దేశాల నుంచి పలు విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్‌రెడ్డి, సీజీసీ చైర్మెన్ డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

17న ఎస్ఎస్‌కే సమాజ్ వార్షికోత్సవం



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు

రాజేంద్రనగర్: ఎస్ఎస్‌కే సమాజ్ వార్షికోత్సవాన్ని ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్లు సమాజ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆనంద్‌రావు మెంగ్జీ తెలిపారు. ఈ వార్షికోత్సవానికి రావాలంటూ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సమాజ్ ప్రెసిడెంట్ ఆనంద్‌రావు మెంగ్జీ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 17వ తేదీన 10వ తరగతి, ఇంటర్మీడియట్, గ్రాడ్యేయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులలో అధిక గ్రేడ్‌లతో ఉత్తీర్ణత సాధించిన ఎస్ఎస్‌కే సమాజ్‌లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డులను అందజేయనున్నామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైస్ ప్రెసిడెంట్ ఉమేష్‌చవాన్, జనరల్ సెక్రటరీ రాజేష్ హబీబ్, జాయింట్ సెక్రటరీ మహేష్‌చవాన్, నారాయణ్ సిరిగిరి, సందీప్ విశ్వనాథ్, రాజ్‌కుమార్‌జ్యోతి, డాక్టర్ ఆదిత్యమెంగ్జీ, దశరథ్ పవార్, హీరాలాల్ పవార్, రాంలాల్ చవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఓఎస్ సేవలు అభినందనీయం

- బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాసరావు

మణికొండ: తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల్ని ఒక కుటుంబ వాతావరణంలో పెంచి సమాజానికి ఎంతో మేలు చేస్తున్న ఎస్ఓఎస్ సేవలు అభినందనీయమని బాలల హక్కుల కమిషన్ చైర్మన్ జె.శ్రీనివాసరావు అన్నారు. గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని సేవ్ అవర్ సౌల్స్(ఎస్ఓఎస్)లో నాలుగు రాష్ట్రాలకు చెందిన ఎస్ఓఎస్ మదర్స్‌కు ఐదు రోజుల జోనల్ స్థాయి శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ పిల్లలను పెంచటం, జీవితంలో రాణించేలా తీర్చిదిద్దటానికి అందులో పనిచేసే తల్లుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ సభ్యులు అంజనారావు, ఎస్ఓఎస్ డైరెక్టర్ కోటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘన స్వాగతం



జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

రాజేంద్రనగర్: జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బీవీ.శ్రీనివాస్‌కు రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన మంగళవారం నగరానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యువసేనరెడ్డి, ఉపాధ్యక్షులు రాజీవ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి విఘ్నేష్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌ముదిరాజ్, సతీష్, హరీష్‌రెడ్డి, బబ్లుముదిరాజ్, శ్రీకాంత్‌ముదిరాజ్, కస్తూరి సతీస్, సంతోష్‌ముదిరాజ్, వినయ్‌రెడ్డి తదితరులున్నారు.

వందశాతం టీకా లక్ష్యం



మైలార్‌దేవ్‌పల్లి పీహెచ్‌సీలో టీకా వేస్తున్న రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ డా. వెంకటేశ్వరరావు

మైలార్‌దేవ్‌పల్లి: వంద శాతం టీకాలు వేయడమే మిషన్ ఇంద్రధనుష్ 5.0 లక్ష్యమని రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న రెండవ విడత కార్యక్రమాల్లో భాగంగా మైలార్‌దేవ్‌పల్లి, పాండురంగానగర్‌లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను మంగళవారం డా.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి 2 సంవత్సరాల పిల్లలకు వంద శాతం టీకాలు వేయాలన్నది మిషన్ ఇంద్రధనుష్ లక్ష్యమన్నారు. మొదటి విడతలో టీకాలు వేయించలేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి టీకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, స్వర్ణకుమారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సృజన, డాక్టర్ పుష్పలత, సిరాజుద్దీన్, ఆర్.రవీందర్‌రెడ్డి, శ్రీనివాసులు, చెన్నకేశవులు, సురేఖ, శైలజ, యశోద తదితరులున్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

రాయదుర్గం: జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు ఓటరు నమోదు ప్రక్రియపై మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. గచ్చిబౌలి, నానక్‌రాంగూడలోని ఐటీ సంస్థల్లో అధికారులు, ఐటీ ఉద్యోగులతో సమావేశమై ఓటరు నమోదు, అడ్రస్, పేర్ల మార్పు వంటి అంశాలపైనే కాకుండా ఓటరు లిస్టులో పేరు ఉందా...? లేదా...? అనే అంశాన్ని పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఏఎంసీ నరేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ భవనంలోని ఐటీ సంస్థలు, నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని అమెజాన్ ఐటీ సంస్థతోపాటు హనీ వెల్ సంస్థలో ఉద్యోగులకు అవగాహన కల్పించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం




ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ నిర్మాణానికి గురువు గొప్ప పునాది అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, ఎంఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

శంషాబాద్: వేతనం పెంచాలంటూ అంగన్‌వాడీలు రెండో రోజు కూడా ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన సమ్మెకు జిల్లా ఉపాధ్యక్షుడు అల్వాల రవికుమార్, జిల్లా నాయకుడు మల్లేష్ మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం రూ. 26 వేలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడంతో పాటు ప్రమాద బీమా రూ.26 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మల్లీశ్వరి, సునీత పాల్గొన్నారు.



30న ఉమాంగ్ 2.0 జువెలరీ, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్





బ్రోచర్ విడుదల చేసిన నటి వర్ష తదితరులు, మోడల్స్ ర్యాంప్‌వాక్

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో జీటో (జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో ఉమాంగ్ 2.0 జువెలరీ, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జీటో చైర్మన్ సుశీల్ సంచేటి తెలిపారు. మగువల అందాలను రెట్టింపు చేసే జువెలరీ అందుబాటులో ఉంటుందన్నారు. సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో కవి సమ్మేళన్, లీడర్‌షిప్ తదితరాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన బ్రోచర్ రిలీజ్ కార్యక్రమంలో జబర్దస్త్ నటి వర్షతో పాటు పలువురు మోడల్స్ పాల్గొన్నారు. అనంతరం ర్యాంప్ వాక్ చేశారు. కార్యక్రమంలో జీటో చీఫ్ సెక్రటరీ పరేశ్‌షా, ట్రెజరర్ బి.ఎల్ బండారీ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

బుద్వేల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకుల నిరాహార దీక్ష



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

రాజేంద్రనగర్: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం మాట తప్పిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ నాయకులు మద్దిలేటి మాదిగ, రాష్ట్ర నాయకులు క్యాసరం శంకర్‌రావులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లులు పెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. రాజేంద్రనగర్ డివిజన్ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరికి వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనకై 29 సంవత్సరాల క్రితం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించారన్నారు. జనాభా ప్రాతిపదికన న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో ఏబీసీడీ వర్గీకరణ చేయాలని పోరాటం చేస్తున్నామన్నారు. షెడ్యూల్ కులాలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలన్నారు. లేని పక్షంలో మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ మునిరాజు అరుణ్‌కుమార్ మాదిగ, మక్తగూడెం కుమార్, కృష్ణమాదిగ, బాబురావు, కొండ సుమన్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు జల్లిపల్లి నరేందర్‌మాదిగ, వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీలో గుంతలమయమైన రోడ్లు

నడిచేదెలా..?

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ శివరాంపల్లి ప్రాంతంలో న్యూ వీకర్‌సెక్షన్ కాలనీలో గుంతల రోడ్ల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. సంవత్సరాలు గడుస్తున్నా కొత్త రోడ్లు వేయకపోవడంతో కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ,రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చనజయప్రకాష్

ఇళ్ల పట్టాలు అందజేత

అత్తాపూర్: సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఈ నెల 2వ తేదీన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ సమయంలో హాజరుకాలేని వారికి మంగళవారం రాజేంద్రనగర్ డివిజన్ ఆర్డీవో కార్యాలయంలో 50 మందికి ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మిద్దెల సురేందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు టి.ప్రేమ్‌గౌడ్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు.